ప్రజలు ప్రశ్నించాలి...

- ఆ విధంగా చైతన్యవంతులు కావాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/హాస్పిటల్

సమస్యలపై పాలకులను ప్రజలు ప్రశ్నించాలని, ఆ విధంగా చైతన్యవంతులు కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఎం చేపట్టిన మహా పాదయాత్ర ఐదో రోజు గూడూరు మండలం కె.నాగలాపురంలో ప్రారంభమై పర్ల, సల్కాపురం మీదుగా పెద్దపాడు వరకు సాగింది. ఈ సందర్భంగా పర్లలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఎం కంకణం కట్టుకుందన్నారు. అనేక మంది పాదయాత్రలు చేశారని, వాటికి, ఈ సిపిఎం పాదయాత్రకు తేడా ఉందని తెలిపారు. వారు అధికారం కోసం పాదయాత్ర చేశారని, సిపిఎం జిల్లా అభివృద్ధి కోసం పాదయాత్ర చేస్తోందని వివరించారు. సాగునీటి ప్రాజెక్టులు చేపట్టాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఈ పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. రైతులు, యువత, ప్రజల కోసం ఈ పాదయాత్ర అన్నారు. ఎల్ఎల్‌సి కాలువకు నీరు రాకుండా పోయే పరిస్థితి వచ్చిందని, ప్రత్యామ్నాయాల గురించి పాలకులకు పట్టడం లేదని తెలిపారు. రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టడం లేదని, కర్నూలు జిల్లా అభివృద్ధికి నోచడం లేదని చెప్పారు. జిల్లా సమగ్రాభివృద్ధికి నాయకులు ఏం చేస్తారో ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాడాలని, ప్రజల కోసం ఆలోచించే నాయకులను కోరుకోవాలని తెలిపారు. ఈ పాదయాత్రకు ప్రజలు మద్దతు తెలపాలని, సోమవారం నిర్వహించే మహా ధర్నాలో పాల్గొనాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి మాట్లాడుతూ... పర్ల గ్రామంలో పూడ్చడానికి శ్మశాన వాటిక లేకపోవడం దారుణమన్నారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయించడానికి ప్రభుత్వానికి చేత కాదా అని ప్రశ్నించారు. ఈ సమస్యపై రాబోయే రోజుల్లో కలిసి కట్టుగా పోరాటం సాగించాలన్నారు. జిల్లాలో తక్షణమే ప్రాజెక్టులు కట్టాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లను కేటాయించాలని కోరారు. సల్కాపురంలో టిడిపి నాయకులు దేవేంద్ర రెడ్డి, సిపిఎం నాయకులు స్వాగతం పలికారు. పాదయాత్ర ఉద్దేశాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.నరసింహా వివరించారు. అనంతరం పెద్దపాడులో సిపిఎం నాయకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పెద్దపాడులో ఏర్పాటు చేసిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి మాట్లాడారు. అనంతరం పాదయాత్ర తాజ్ ఫంక్షన్ హాల్ వరకు సాగింది. పాదయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మహా ధర్నా

సిపిఎం చేపట్టిన మహా పాదయాత్రలో భాగంగా సోమవారం మహా ధర్నా చేపట్టనున్నారు. ఉదయం తాజ్ ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర కర్నూలు నగరం గుండా సాగుతూ కలెక్టరేట్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నారు. ఈ మహా ధర్నాకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు హాజరు కానున్నారు.





పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

'అమృత్ భారత్ స్టేషన్'లో
రైల్వేస్టేషన్ పునరాభివృద్ధికి శంకుస్థాపన

- ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ హాజరు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

'అమృత్ భారత్ స్టేషన్' పథకంలో భాగంగా ఆదివారం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసినట్లు కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ తెలిపారు. కర్నూలు రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారంలో ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నగర మేయర్ బివై.రామయ్య, రైల్వే శాఖ సీనియర్ డిఎన్‌సి లైన్స్ అనిల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కర్నూలు సిటీ ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలను హైదరాబాద్‌తో అనుసంధానం చేస్తున్న ముఖ్యమైన మార్గాల్లో ఉన్న కర్నూలు రైల్వేస్టేషన్ అభివృద్ధికి దాదాపు రూ.42.62 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. దేశంలో రైల్వే వ్యవస్థ అతి పెద్ద వ్యవస్థ అని, ఈ వ్యవస్థను రక్షించుకోవడం మన బాధ్యత అని తెలిపారు. రైలులో ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ టికెట్ కొనాలని, రైల్వే పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కర్నూలు నగరం నుంచి మచిలీపట్నానికి వెళ్లే రైలును పునరుద్ధరించాలని కోరారు. కర్నూలు నుంచి విజయవాడకు రోడ్డు మార్గం సరిగా లేనందున ప్రజలు రైల్వే ప్రయాణంపై ముగ్గు చూపుతారని తెలిపారు. రోజూ కర్నూలు నుంచి విజయవాడకు రైలు నడపాలని, ఈ రైల్వే స్టేషన్‌కు ఫిట్ లెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. వర్క్ షాప్ కూడా ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు తెలిపారు. అనంతరం జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడారు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌ను దాదాపు రూ.43 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ నిధులను మంజూరు చేయించడంలో ఎంపీ కృషి ఉందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ... ఈ ప్రాంతం వెనుకబడిన ప్రాంతమని, పేదలు తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించే సౌకర్యం ఒక రైలు ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. మేయర్ బివై.రామయ్య మాట్లాడుతూ... కర్నూలు నగరానికి రైల్వే శాఖ తలమానికం లాంటిదని, తక్కువ ఖర్చుతో ఎక్కువ మందిని సుదూర ప్రాంతాలకు చేర్చేది ఒక్క రైలు మార్గమేనని తెలిపారు. జిల్లా నుంచి ఇంకా కొత్త రైళ్లను నడపాలని, కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు ఒక రైలు, కర్నూలు నుంచి శ్రీశైలం, మార్కాపురానికి ఒక రైలు, కర్నూలు నుంచి మంత్రాలయానికి రైలు వేస్తే బాగుంటుందని రైల్వే అధికారులకు సూచించారు. బిజెపి జిల్లా ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర, నగర డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, స్టేషన్ మేనేజర్ సుంకన్న, డిసిఎంఎస్ ఛైర్మన్ శిరోమణి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, జడ్‌పి ఛైర్మన్, మేయర్, డిప్యూటీ మేయర్

ప్రజల నుంచి విశేష స్పందన

- జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా మహా పాదయాత్ర
- పాదయాత్రలో పలువురి అభిప్రాయం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

సిపిఎం చేపట్టిన మహా పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా మహా పాదయాత్ర సాగిస్తున్నట్లు సిపిఎం నాయకులు చెబుతున్నారు. పాదయాత్ర సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను ప్రజాశక్తితో పంచుకున్నారు...

ప్రజల నుంచి మంచి స్పందన

- ఎమ్‌డి.ఆనంద్ బాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు



జనం ఇలాంటి పాదయాత్రను కోరుకుంటున్నారు. పాలకుల విధానాల వల్ల ప్రజలు విసిగిపోయారనేది ఈ పాదయాత్రలో కనిపిస్తోంది. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, మురుగు కాలువలు లేక సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

ప్రజల సమస్యలు తెలుసుకున్నా



- డి.విజయ, కెవిపిఎస్ మహిళా ఉపాధ్యక్షులు

మహిళలపై నేరాలు పెరిగిపోతున్నాయి. మద్యం ఏరులై పారడమే అందుకు కారణం. మద్యాన్ని నిషేధిస్తామని హామీ ఇచ్చిన జగన్ దానిని అమలు చేయకుండా గాలికి వదిలేశారు. సిపిఎం మహా పాదయాత్రలో భాగమైనందుకు సంతోషంగా ఉంది. ఈ పాదయాత్ర ద్వారా రైతులు, ప్రజల సమస్యలు తెలుసుకున్నా.

వృత్తిని పరిరక్షించాలి

- సి.గురుశేఖర్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు



వృత్తిదారులు చాలా మంది పనుల్లేక గ్రామాలను వదిలి పట్టణాలకు వలస పోతున్నారు. వృత్తిని పరిరక్షించాలి. అదేవిధంగా ఆధునీకరించాలి. సిపిఎం చేపట్టిన మహా పాదయాత్రలో భాగమైనందుకు చాలా సంతోషపడుతున్నా. మళ్లీ ఇలాంటి అవకాశం వస్తుందో రాదో తెలియదు.

విద్యా రంగాన్ని బలోపేతం చేయాలి



- ఎస్.అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

పాదయాత్రలో ముందు నుంచి నడుస్తున్నా. మహా పాదయాత్రలో భాగమైనందుకు సంతోషంగా ఉంది. జిల్లాలో విద్యారంగ అభివృద్ధిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయి. జిల్లాలో విద్యా రంగాన్ని బలోపేతం చేయాలి. యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- హుస్సేన్ బాషా, డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి



జిల్లాలో పరిశ్రమలు లేక చదువుకున్న యువతకు ఉద్యోగాలు దొరకడం లేదు. ప్రభుత్వం తక్షణమే జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. యువతకు ఉపాధి కల్పించాలి. పాదయాత్రలో మొదటి రోజు నుంచి నడుస్తున్నాను. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం చేపట్టిన ఈ పాదయాత్రలో భాగమైనందుకు గర్వపడుతున్నాను.

పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై దృష్టి

- అక్షరాస్యత శాతం పెంపునకు చర్యలు
- స్పందన అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం
- జిల్లాను అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయం - కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉందని, ఆ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అభిప్రాయం వ్యక్తంచేశారు. అదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఇప్పటికే అనేక ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతున్నామని తెలిపారు. కర్నూలు జిల్లా అక్షరాస్యత శాతం పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదివారం ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ఎలాంటి కృషి చేస్తున్నారు?

కలెక్టర్ : కర్నూలు జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలను పకడ్బందీగా పేదలందరికి అందేలా చూస్తున్నాం. ఓర్వకల్ పారిశ్రామికవాడలో పరిశ్రమలు నెలకొల్పేందుకుగాను అక్కడ అన్ని రకాల వసతులను కల్పిస్తున్నాం. ఓర్వకల్ ఎయిర్ పోర్టును కూడా మరింత అభివృద్ధి చేయనున్నాం. కర్నూలు జిల్లా చుట్టూ అనేక విద్యా సంస్థలున్నాయి. ఇక్కడ విద్యాపరంగా మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ, వార్డు సచివాలయాలు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందేలా చూస్తున్నాం. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలకు వైద్యం అందించేందుకు దృష్టి పెట్టాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత భవనాల నిర్మాణపు పనులను పూర్తిచేయనున్నాం. జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహ నిర్మాణాలను త్వరతగతిన పూర్తిచేస్తున్నాం. సమగ్ర భూసర్వే ద్వారా భూములను రీసర్వే చేసి రెవెన్యూ సమస్యలకు చెక్ పెడుతున్నాం.

బాల్యవివాహాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

కలెక్టర్ : జిల్లాలో బాలిక విద్యలో అభివృద్ధి కొరవడింది. పదో తరగతి పూర్తికాగానే వెంటనే అమ్మాయిలకు పెళ్లి చేసి పంపుతున్నారు. ఇప్పటికే బడి ఈడు అమ్మాయిలను గుర్తించి వారికి విద్యను అందించేందుకు చర్యలు చేపట్టాం. ఇటీవల టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినటువంటి అమ్మాయి ఇంటర్ చదివించడానికి ప్రొత్సహించకపోతే మా దృష్టికి రాగానే వెంటనే కెజిబివిలో ఇంటర్ అడ్మిషన్ కల్పించడం జరిగింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో బాల్యవివాహాలు అత్యధికంగా జరుగుతున్నాయి. బాల్యవివాహాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బాలికలకు విద్యను అందించేందుకుగాను కృషి చేస్తున్నాం. తల్లితండ్రులు కూడా తప్పనిసరిగా అమ్మాయిలను చదివించేందుకు ప్రొత్సహించాలి.

పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై యాక్షన్ ప్లాన్ ఏంటి?

కలెక్టర్ : జిల్లాలోని పశ్చిమ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకంజలో నిలిచింది. ఈ ప్రాంతంలో అభివృద్ధి కొరవడింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం అదోని ఏరియాడెవలప్‌మెంట్ ఆథారిటీ బోర్డును ఏర్పాటు చేసింది. ఈ బోర్డులో ప్రజాప్రతినిధులతో పాటు అధికారులందురు సభ్యులుగా ఉంటారు. ఈ ప్రాంతంలో వ్యవసాయపరంగా అభివృద్ధి చేసేందుకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సాగునీటి ప్రాజెక్టు పనులను పూర్తిచేసి సకాలంలో సాగు, తాగునీరును ఈ ప్రాంత ప్రజలకు అందించనున్నాం. పారిశ్రామిక పరంగా ఇక్కడ జీన్స్ క్లస్టర్ పరిశ్రమను ప్రొత్సహించేందుకు ప్రణాళికలను రూపొందించాం. పత్తికొండ పరిసర ప్రాంతంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేయనున్నాం. వీటితోపాటు ప్రభుత్వపరంగా అమలుచేయాల్సిన అభివృద్ధిపనులను చేపట్టనున్నాం. నాడు- నేడు ద్వారా ప్రత్యేకంగా నిధులను విడుదల చేసి పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించనున్నాం. అదోని ప్రాంతం అభివృద్ధిపై ప్రత్యేకంగా యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నాం.



పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

కలెక్టర్ : కర్నూలు జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. ఇటీవల జిల్లా ఇంచార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి టూరిజం అభివృద్ధిపై దిశా నిర్దేశం చేశారు. గార్గేయపురం సమీపంలో నగర వనం అభివృద్ధితో పాటు సుంకేసుల, గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలో టూరిజం కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. విజయవనాన్ని అభివృద్ధి చేసి టూరిజం హబ్‌గా మార్చడం జరుగుతుంది.

వినతుల పరిష్కారానికి ఏం చేస్తున్నారు?

కలెక్టర్ : స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలకు వచ్చే బాధితుల వినతులను పరిష్కరించేందుకు ప్రాధాన్యతగా తీసుకుంటున్నాం. బాధితుడికి మాత్రం తప్పనిసరిగా న్యాయం చేయడమే నా లక్ష్యమని. ఇప్పటికే స్పందన కార్యక్రమానికి అనేక రకాల సమస్యలతో ప్రజలు వస్తుంటున్నారు. ఇప్పటికే జిల్లా, మండలస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు స్పందనకు వచ్చే సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించడం జరుగుతుంది. బాధితుడి తిరిగి తిరిగి వేసారిపోకుండా తప్పనిసరిగా న్యాయం చేసినప్పుడే సంతృప్తి పొందుతారు.

జగన్ ప్రభుత్వంలో అటకెక్కిన అభివృద్ధి

- టిడిపి పాణ్యం ఇన్‌చార్జీ గౌరు చరిత

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి అటకెక్కిందని టిడిపి పాణ్యం ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ అదేశాల మేరకు సెల్ఫీ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కల్లూరు ముజఫర్ నగర్‌లో టిడిపి ప్రభుత్వంలో రైతుబజార్ కోసం శంకుస్థాపన చేసిన స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో 2017లో ముజఫర్ నగర్‌లోని మునిసిపల్ కార్పోరేషన్ స్థలంలో రూ. 52 లక్షలతో కల్లూరు మండల రైతులకు నేరుగా కూరగాయలు అమ్ముకోవడడానికి రైతు బజార్ నిర్మాణానికి కాంపౌండ్ వాల్, గేట్ పనులు చేశామన్నారు. ఎన్నికలు రావడంతో ఆ పనులు మధ్యలో ఆగాయని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక దాన్ని పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. కర్నూలు మార్కెట్ యార్డ్‌లో రైతుల కోసం 7 కోట్ల నిధులతో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తే వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టారని మండిపడ్డారు. రైతు బజార్ పనులు, కోల్డ్ స్టోరేజ్ పనులు పూర్తి కావాలంటే మళ్ళీ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రిగా వస్తేనే పూర్తి అవుతాయన్నారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కే పార్వతమ్మ, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ యన్‌వి రామకృష్ణ, మైనారిటీ నాయకులు బషీర్, పీయు మాదన్న, టైలర్ నాగరాజు, స్థపతి లక్ష్మి రెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి, పవన్ కుమార్, వై జగన్ రెడ్డి, క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.



రైతు బజార్ నిర్మాణానికి వేసిన శిలాఫలకం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న గౌరు చరిత రెడ్డి

నేడు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు రాక

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్ర నేడు ముగింపు సందర్భంగా కలెక్టరేట్ ఎదుట మహాధర్నాలో పాల్గొనేందుకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు వస్తున్నట్లు జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు పెద్దపాడు దగ్గర ఉన్న తాజ్ ఫంక్షన్ హాల్ నుండి మహా పాదయాత్ర ప్రదర్శన ప్రారంభమవు తుందని తెలిపారు. ఉదయం 10 గంటలకు 4వ పట్టణ పోలీస్ స్టేషన్ బళ్ళారి చౌరస్తాలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. కావున జిల్లా సమగ్ర అభివృద్ధిని ఆకాంక్షించే రైతులు, శ్రేయోభిలాషులు, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజాదరణ లేకనే చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యలు

- జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసం యాత్ర అనవసరమైనదని, గొడవలు, అల్లర్లు సృష్టించే దిశగా ఆయన ప్రవర్తన ఉందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియోజకవర్గం పులివెందులలోనే అనుమతి ఇస్తే పుంగనూరులో ఎందుకు అనుమతి ఇవ్వరని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 1 నుండి చంద్రబాబు చేస్తున్న యాత్రకు ప్రజలు రావడంలేదని, ప్రజల్లో విశ్వాసం కోల్పోయారని, నిరాశ, నిస్పృహ కోల్పోయిన చంద్రబాబు అల్లర్లు సృష్టించేలా మాట్లాడి రణరంగంగా మారుస్తున్నారని అన్నారు. పుంగనూరు బైపాస్ నుండి పలమనేరుకు వెళ్లేలా రూట్ మ్యాప్ ఉంటే అలా కుదరదని, పుంగనూరులోకే వెళ్ళాలని పట్టుబట్టి వెళ్లారన్నారు. ముందుగానే అనుమతి కోరితే ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కుప్పం నియోజకవర్గంలో అనేక రకాల అభివృద్ధి పనులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్నాయని, కుప్పం మున్సిపాలిటీ వైసిపి కైవసం చేసుకుందని, కుప్పంలో తాను గెలవలేనేమోననే భయంతో తట్టుకోలేక చంద్రబాబు పెద్దిరెడ్డిని మానసికంగా దెబ్బతీసి అపకీర్తిపాలు చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాయలసీమలో తాగు, సాగు నీటికి దివంగత నేత రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలకు ప్రజలు నీరాజనం పట్టారన్నారు. చంద్రబాబు చేసింది శూన్యం కాబట్టే ఈ రోజు ప్రజల్లో ఆదరణ లేదన్నారు. 1988లో మహానాడు నిర్వహిస్తే అదే సమయంలో వంగవీటి రంగ కాపునాడు నిర్వహించారని, మహానాడు కంటే కాపునాడుకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొంటే ఓర్వలేకనే రంగను హత్య చేయించిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. 40 సంవత్సరాల అనుభవం ఉన్న చంద్రబాబు సలహాలు, సూచనలు ఇవ్వచ్చు కానీ విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రజలలో ఆదరణ పొందేలా వ్యవహరిస్తే మంచిదని హితవు పలికారు.



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్మన్



మాట్లాడుతున్న ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

క్రీడలతో క్రమశిక్షణ, ఏకాగ్రత

- ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

విద్యార్థులు చిన్నతనం నుండే క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ, ఏకాగ్రత పెరిగి చదువులో రాణించే అవకాశం ఉంటుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం కర్నూల్ నగరంలోని పెద్ద మార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో తైక్వాండో సీనియర్ శిక్షకుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తైక్వాండో ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు వాటర్ బాటిళ్లను బహుమతిగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో, చదువులో రాణించాలంటే మెరుగైన ఆరోగ్యం ఉండాలని సూచించారు. ఇంటిలో చేసిన ఆహార పదార్థాలను మాత్రమే తినాలని సూచించారు. విద్యార్థులు ఇంటి నుండి స్వచ్ఛమైన మంచినీరు తీసుకునేందుకు వీలుగా వాటర్ బాటిళ్లను అందజేసినట్లు వివరించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ తైక్వాండో కోచ్ వెంకటేశ్వర్లు, రోహిత్, నాగరాజు, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాల్వకు నీళ్లు వచ్చేనా..?

- సాగునీటి కోసం రైతన్న ఎదురుచూపులు

ప్రజాశక్తి - పత్తికొండ

హంద్రీనీవా కాల్వకు అధికారులు నీళ్ళ ఎప్పుడు వదులుతారా అని పత్తికొండ నియోజకవర్గంలోని రైతులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడంతో పంటల సాగుపై ప్రభావం పడింది. పత్తికొండ మండలం గ్రామీణ ప్రాంతాలలో జులై లో కురిసిన వర్షానికి కొన్ని వేల ఎకరాలలో పత్తి, ఆముదం, సజ్జ, వేరుశనగ, కొర్రలు, టమోటా, ఇతర కూరగాయలను రైతులు సాగు చేశారు. దాదాపుగా 15 రోజుల నుంచి వర్షం రాకపోవడం పంటలు ఎండు ముఖం పడుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు నుండి హంద్రీనీవా కాలువకు నీరు వదిలితే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. శ్రీశైలం ప్రాజెక్టు ప్రస్తుతం 858 అడుగుల నీటి మట్టం ఉంది. హంద్రీనీవా కాలువకు నీరు వదలాలంటే 834 అడుగులు మించిన తర్వాత నీరు కాలువకు నీరు వదులుతారు. గతంలో జులై మాసంలోనే హంద్రీనీవా కాలువకు నీరు వచ్చిందని, ఈ ఏడాది ఇప్పటివరకు నీరు వదలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి పంట తెగుళ్లతో నష్టపోతున్నామని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు పత్తికి తెగులు సోకి పంటను పూర్తిగా తొలగించిన సంఘటనలు పత్తికొండ మండలంలో చోటుచేసుకున్నాయి. సకాలంలో వర్షాలు లేక పంటలు అరకొర సాగు చేశామని, ఇలాగే కొనసాగితే తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని, చేసిన అప్పులు తీర్చలేక అప్పుల పాలవుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి హంద్రీనీవా కాలువకు నీరు వదలాలని రైతులు కోరుతున్నారు.



హంద్రీనీవా కాల్వ

త్వరలో హంద్రీనీవాకు నీరు వదులుతాం

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీనీవా కాలువకు త్వరలోనే నీటిని విడుదల చేస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చిన వెంటనే నీటిని విడుదల చేస్తాం..

- సదాశివరెడ్డి, హంద్రీనీవా ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్.

నీళ్లు ఇస్తే పంటలను కాపాడుకుంటాం

5 ఎకరాలలో పత్తి, ఆముదం, ఉల్లి, టమోటా పంటలను సాగు చేశాను. వర్షాలు లేక పంటలు ఎండు ముఖం పడుతున్నాయి హంద్రీనీవాకు నీళ్ల వస్తే పంటలు కాపాడుకుంటాం. లేకపోతే ఆత్మహత్యలే శరణ్యం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నీళ్ల వదలాలి.

- యువ రైతు కనుగొండ రంగన్న.

ఖరీఫ్‌పై సన్నగిల్లుతున్న ఆశలు

- మండలంలో ఇప్పటిదాకా పడని పత్తి విత్తనం
- రెండు నెలల్లో పదునైన వర్షం లేక తంటాలు పడుతున్న రైతులు
- గతేడాది 6 వేల ఎకరాల్లో పత్తి సాగు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలంలో ఇప్పటిదాకా ఒక్క పదునైన వర్షం కూడా కురవలేదని మండల ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సమృద్ధిగా వర్షాలు కురిశాయి. ఖరీఫ్‌లో వివిధ రకాల పంటలు అంతే, ఇంతే సాగు చేశారు. గతేడాది మండలంలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 6 వేల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈఏడాది ఖరీఫ్ సీజన్ మొదలైనా మండలంలోని ఏ గ్రామంలోనూ పత్తి సాగు కానీ, వేరే పంటలు కానీ ఆరంభించలేదని రైతులు తెలుపుతున్నారు. నంచర్ల గ్రామంలో ఒక మోస్తారు వర్షానికి ఎర్ర పొలంలో కంది విత్తనం సాగు చేశారు. అది కూడా మొలకెత్తి ఎక్కువగా గాలికి, ఎండ వేడిమికి మొలక ఎండిపోతోందని రైతులు వాపోతున్నారు. గత రెండు నెలల్లో మండలంలో ఎక్కువ వర్షపాతం నమోదు కాలేదని రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. గత రెండు వారాల నుంచి 'వర్షం ఈరోజు వస్తుంది... రేపు వస్తుందని' ఆశతో కొంతమంది రైతులు ఎదురుచూస్తున్నారు. అప్పో సప్పో చేసి పత్తి విత్తనాలు, కంది, వేరుశనగ, ఎరువులు కొన్నామని రైతులు పేర్కొంటున్నారు. రోజులు గడుస్తున్నాయి కానీ, సరైన వర్షాలు కురవడం లేదని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆడియాశలే మిగిలిస్తుందేమోనన్న బెంగతో రైతులు ఉన్నారు. మండలంలో ప్రధానంగా రామదుర్గం, నేమకల్లు, నంచర్ల, చిప్పగిరి ఈ గ్రామాలకు చెందిన ఎర్రమట్టి పొలం ఉన్న రైతులందరూ ఖరీఫ్ సీజన్‌పైనే ఆధారపడాల్సిన పరిస్థితి. అదును తప్పి వర్షాలు వచ్చినా ఆశకు పోయి ఏదో ఒక విత్తనం వేసుకున్నా పంటల దిగుబడి మాత్రం రాదని, ఎన్నోసార్లు కూడా అనుభవించామని రైతులు పేర్కొంటున్నారు. రైతులను ఖరీఫ్ సీజన్ ఎలా ఆదుకుంటుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు.


విత్తనం వేయడానికి సిద్ధంగా ఉన్న పొలం

సొసైటీల్లో రైతులకు రుణ మాఫీ వర్తించదు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

సొసైటీల్లో రైతులకు రుణమాఫీ ఉంటుందని అపోహ పడవద్దని, రుణమాఫీ వర్తించదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి నాయకులు, ఎమ్మిగనూరు ఆర్టీసి డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని కలుదేవకుంట సహకార సంఘం నూతన అధ్యక్షులు కె.రఘునాథ్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బాలనాగిరెడ్డి, సీతారామిరెడ్డి హాజరయ్యారు. వారికి పూలవర్షంతో, డప్పు వాయిద్యాలతో, బాణసంచా పేలుస్తూ స్వాగతం పలికారు. గజమాలలు, శాలువాలతో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కలుదేవకుంట గ్రామంలో రాఘవరెడ్డి కుటుంబానికి ప్రత్యేక ఉందని, ఆయన మార్గదర్శకత్వంలో ఈ సొసైటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలి అధ్యక్షులుగా ఆయన సేవలందించి సొసైటీ అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. ప్రస్తుతం ఆయన పెద్ద కుమారుడు రఘునాథ్ రెడ్డికి మళ్లీ సేవ చేసే అవకాశం దక్కిందన్నారు. మాజీ ఛైర్మన్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ 70 శాతం రికవరీతో రూ.20 కోట్ల టర్నోవర్‌తో ఉందని తెలిపారు. దానిని రూ.40 కోట్ల టర్నోవర్‌కు తీసుకెళ్తామని నూతన అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి చెప్పడం సంతోషంగా ఉందని చెప్పారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే వడ్డీ కూడా తక్కువ పడుతుందని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

కలుదేవకుంట గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన రంగన్న, భీమయ్య, ఇసాక్‌లు గ్రామంలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏళ్ల నాటి చిన్న పైప్‌లైన్ వల్ల కలుదేవకుంట, చిలుకలడోన గ్రామాలకు నీటి సమస్య ఉందని తెలిపారు. సుమారు రూ.కోటి వ్యయంతో ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సి వస్తుందని చెప్పారు. కౌతాళం మండలం ఎరిగేరి గ్రామంలో ఇదే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహాయంతో ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా త్వరలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

రాంపురం రెడ్డి సోదరుల సహకారంతో సొసైటీ అభివృద్ధికి కృషి
- సొసైటీ నూతన అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి

రాంపురం రెడ్డి సోదరుల సహకారంతో సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్షులు కె.రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ... 11 గ్రామాల రైతుల అనుసంధానంతో ఏర్పాటు చేసిన సొసైటీ అభివృద్ధికి మాజీ ఛైర్మన్ వెంకటరెడ్డి కృషి చేశారని కొనియాడారు. రానున్న రోజుల్లోనూ మరింత అభివృద్ధికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, సీతారామిరెడ్డి సహకారం అందించి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నుంచి ఎక్కువ నిధులు మంజూరు చేయించాలని కోరారు. రఘునాథ్ రెడ్డికి సొసైటీ సిఇఒ వెంకటేశ్వర్లు సిబ్బందితో పాటు స్నేహితులు, శ్రేయోభిలాషులు శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జి విశ్వనాథ్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ మాజీ వెంకటరెడ్డి, మంత్రాలయం, మాలపల్లి, తిమ్మాపురం సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, సీతారామిరెడ్డి, వీరారెడ్డి, రోడ్లు కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, కాంతా రెడ్డి, యువ నాయకులు విశ్వనాథ్ రెడ్డి, సివి శ్రీనివాసులు, ఎస్‌వి వేణుగోపాల్ రాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి


బాలనాగిరెడ్డిని, సీతారామిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు


గుంతలమయమైన గ్రామీణ రోడ్డు

అధ్వానంగా రోడ్లు..

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని బైచిగేరి, జాలమంచి, కపటి గ్రామాలతో పాటు పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు చేరడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. బైచిగేరి నుంచి కపటి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుప్పగల్ క్రాస్ నుంచి జాలమంచి గ్రామానికి వెళ్లే రోడ్డు మరింత దారుణంగా మారిందని పేర్కొంటున్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయం కావడంతో చీకటి పడిన తర్వాత ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయం కావడంతో అతి కష్టమ్మీద రాకపోకలు సాగించాల్సి వస్తోంది. నిత్యం వందలాదిమంది ఉద్యోగులు పట్టణానికి, గ్రామాలకు, వివిధ ప్రాంతాలకు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'సహకరించుకుంటూ జీవించాలి'

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని టూరిస్టు లాడ్జి, ఆటో స్టాండ్ దగ్గర కర్నూలు పాటిస్తూ సహకరించుకుంటూ ఆటో డ్రైవర్లు జీవించాలని యూనియన్ గౌరవాధ్యక్షులు పిఎస్.గోపాల్, నాయకులు గోవిందు, శంకర్ కోరారు. శనివారం కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుకు, ప్రమాద బీమా సౌకర్యాల కల్పన కోసం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆలూరు



మండలంలోని కురుకుంద గ్రామంలో అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి రైతు మొల్లా ఖాదర్ బాష (38) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నారు. బంధువుల వివరాల మేరకు... ఖాదర్ బాష తనకున్న రెండెకరాల్లో మిరప పంటను సాగు చేస్తూ సుమారు రూ.6 లక్షల దాకా అప్పులు చేశారు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక శనివారం రాత్రి గ్రామంలోని సచివాలయ ఆవరణలో పురుగు మందు తాగి ఆత్మహయాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన బంధువులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతునికి భార్య మాబున్నిసా, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పథంలో తెర్నేకల్ హైస్కూల్

ప్రజాశక్తి- దేవనకొండ

రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం హర్షించదగ్గ విషయమని తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ చిన్న వెంకప్ప పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. తెర్నేకల్ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నాడు-నేడు కింద రూ.2.60 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధుల ద్వారా పాఠశాలలో 18 అదనపు గదుల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మండలంలోని అతిపెద్ద హైస్కూల్ అయిన తెర్నేకల్ పాఠశాలకు అన్ని రకాల వసతుల కల్పిస్తున్నట్లు తెలిపారు. నాడు-నేడు పనుల ద్వారా వసతులు కల్పించడంతో పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు మెరుగుపడ్డాయన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన మధ్యాహ్న భోజనం, తాగునీటి వసతి, జగనన్న విద్యా కానుక ద్వారా పుస్తకాలు, బ్యాగు, యూనిఫారం, బూట్లు పంపిణీ చేయడం ద్వారా కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల రూపుదిద్దుకున్నట్లు తెలిపారు.


తెర్నేకల్‌లో పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణాలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

- సిపిఎం పట్టణ, మండల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం చేపడుతున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, వీరారెడ్డి, రామాంజనేయులు, నాయకులు తిక్కప్ప, నాగరాజు కోరారు. ఆదివారం ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 2న ఆదోని నుంచి ప్రారంభమైన మహాపాదయాత్ర 7న కలెక్టరేట్ చేరుకుంటుందని తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న తాగు, సాగునీటి ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో రాజకీయంగా అత్యున్నతమైన పదవులు పొందిన రాజకీయ నాయకులు జిల్లా అభివృద్ధికి చేసింది శూన్యమని విమర్శించారు. సిపిఎం మహా పాదయాత్రకు జిల్లాలో అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పడుతూ, సమస్యలను పాదయాత్ర దృష్టికి తీసుకొస్తున్నారని తెలిపారు. ఆదోనిలో శిథిలావస్థకు చేరుకున్న పాత ఫ్లై ఓవర్ బ్రిడ్జి స్థానంలో కొత్త ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. పట్టణ జనాభాకు అనుగుణంగా అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆదోని ప్రభుత్వాస్పత్రిని జిల్లాస్థాయి ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ, అన్ని రకాల జబ్బులకు వైద్యులను నియమించి మెరుగైన వైద్య పరికరాలు, సిటి స్కాన్, ఎంఆర్‌ఐ ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చేపడుతున్న కలెక్టరేట్ ముట్టడిలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థిని కుట్టిన విషపురుగు

- పరిస్థితి విషమం
- ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స

ప్రజాశక్తి - ఆదోని


విద్యార్థిని కల్పన

పట్టణంలోని మండగిరి పంచాయతీ పరిధిలోని బీసీ బాలికల కళాశాల హాస్టల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న కల్పన అనే విద్యార్థిని విషపురుగు కుట్టింది. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థిని కల్పనను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు వెళ్లాలంటూ వైద్యులు రిఫర్ చేశారు. హాస్టల్ వార్డెన్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆదోని నుంచి కర్నూలుకు వచ్చేందుకు సమయం పడుతుందని, మెరుగైన వైద్యం కోసం ఆదోనిలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స అందించాలని సూచించారు. ఎస్‌కెడి కాలనీలో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో విద్యార్థికి ఐసియులో చికిత్స అందిస్తున్నారు. జిల్లా బీసీ వెల్ఫేర్ డిడి వెంకటలక్ష్మి అక్కడికి చేరుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్పనను పరామర్శించారు. ప్రస్తుతం కల్పన ఆరోగ్యం కుదుటపడుతోందని, ఐసియులో చికిత్స అందుతోందని డిడి వెంకటలక్ష్మి ప్రకటించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము కర్నూలుకు తీసుకొచ్చేలోపు ఆలస్యం అవుతుందని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఆమె తెలిపారు. విద్యార్థిని కోలుకుంటుందన్నారు. ఎస్‌కెడి కాలనీలో బాలికల కళాశాలకు సమీపంలో ఉన్న హాస్టల్‌ను గతేడాది ఖాళీ చేసి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజీవ్ గాంధీ నగర్‌లో ఏర్పాటు చేశారు. శివారు ప్రాంతం కావడం చుట్టుపక్కల పిచ్చి మొక్కలు, అపరిశుభ్రత ఉండడంతోనే విషపురుగులు కుట్టాయని విద్యార్థినులు వాపోతున్నారు. ఈ భవనంలో ఉండలేమంటూ ఇటీవల విద్యార్థులు తమ ఆవేదనను వెల్లగక్కారు. ప్రత్యామ్నాయం చూడకుండా వార్డెన్ నిర్లక్ష్యం చేస్తున్నారని బాలికలు వాపోతున్నారు.

అయోమయానికి గురి చేస్తున్నారు
- విద్యార్థిని తల్లి లక్ష్మి

విద్యార్థిని కల్పన ఆదోనిలోని మధు ఆస్పత్రి ఐసియులో చికిత్స పొందుతోంది. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంటుందంటున్నారు. డాక్టర్లు వస్తున్నారు. చూస్తున్నారు. పోతున్నారు. సరైన సమాధానం చెప్పడం లేదు. అయోమయానికి గురి చేస్తున్నారు. మెరుగైన వైద్యం అందించి మా బిడ్డ ప్రాణాలను కాపాడాలి.

ఊపందుకున్న వరి నాట్లు

- వరి నారుకు పెరిగిన గిరాకీ
- భారంగా మారిన ఎరువులు

ప్రజాశక్తి - హొళగుంద

ఎల్‌ఎల్‌సి కాలువ ఆయకట్టు సాగు భూముల్లో వరి నాట్లు ఊపందుకున్నాయి. అదునుగా భావించిన రైతులు పంట పొలాల్లో గేజ్ వెల్ తిప్పి పదును చేసుకొని వరి నారు అంటించడానికి సిద్ధంగా ఉన్నారు. 40 రోజుల క్రితం నీరు లభ్యత ఉన్న బోరు, బావుల దగ్గర వరిమళ్లు వేసుకొని ఉండగా, అంటించడానికి నారు చేతికి వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు.

వరి నారుకు పెరిగిన గిరాకీ

వరినారుకు గిరాకీ పెరిగిందని, ఒక సెంటు వరి నారు రూ.1000 చొప్పున కొనుగోలు చేస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 3 సెంట్లు అవసరమవుతుందని, నారు కోసమే ఎకరాకు రూ.3 వేలు ఖర్చు పెట్టక తప్పడం లేదని చెబుతున్నారు.

భారంగా మారిన ఎరువులు

ఎరువుల ధరలు పెరగడంతో వ్యవసాయం భారంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిఎపి ధర రూ.1350, 10-26 ధర రూ.1470, 20-20 ధర రూ.1400, 16-20 ధర ర.1350, యూరియా రూ.270 ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

రెండేళ్లుగా నష్టపోతున్న రైతులు

రెండేళ్లుగా వ్యవసాయం వల్ల నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఎరువుల ధరపై సబ్సిడీ ఇస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నాయి. రైతు దగ్గర నుంచి ఒక బస్తా వరి ధాన్యం రూ.1400 నుంచి రూ.1500 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక బస్తా వరి ధర ఒక సంచి ఎరువుతో సమానంగా ఉంది. వ్యవసాయం వల్ల లాభం పొందలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుల పాలైనా వ్యవసాయం చేయక తప్పడం లేదని వాపోతున్నారు. ఈఏడాది పెస్టిసైడ్ ధరలు పెరిగాయని, మందులు ఎలా పిచికారి చేయాలని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువులు, పురుగు మందులను రాయితీ కింద అందజేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.


వరి నాట్లు వేస్తున్న రైతులు

బిజెపిని గద్దె దించండి

- 9న కలెక్టరేట్ ముందు మహా ధర్నా
- సిఐటియు తాలూకా కార్యదర్శి రాముడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని, దేశాన్ని కాపాడాలని సిఐటియు తాలూకా కార్యదర్శి రాముడు కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 9న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో నేడు 'క్విట్ బిజెపి ప్రభుత్వం.. దేశాన్ని కాపాడుదాం' నినాదంతో కార్మిక వర్గం ఉద్యమించాలని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పింఛను, గ్రాట్యుటీ సౌకర్యాలు కల్పించాలని ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. సిఐటియు, ఎఐటియుసి నాయకులు నరసింహులు, వీరేష్, ఇస్మాయిల్, సుమాల రాజు, మాణిక్యం, నాగరాజు, మునీంద్ర, ఎఐకెసి నాయకులు అబ్దుల్లా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాముడు

అన్నకు అండగా ఉమాపతి నాయుడు

- కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కార్యకర్తలను ఉత్సాహ పరుస్తున్న వైనం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాలను చైతన్య పరిచిన వారిలో మీనాక్షి నాయుడు ముందున్నారన్నది అందరి నోట మాట. పలకరింపు, కార్యకర్తల పట్ల చూపుతున్న సోదరభావం విషయంలో ఆయనను మించిన వారు లేరన్నది వాస్తవం. 1994, 1999 రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా మీనాక్షి నాయుడు ఆదోని అభివృద్ధికి బాటలు వేశారని నాయకులు చెబుతున్నారు. 2004లో రాజకీయ సమీకరణల వల్ల అధిష్టానం గుడిసె కృష్ణమ్మను టిడిపి అభ్యర్థిగా బరిలో దింపింది. అప్పట్లో మీనాక్షి నాయుడు కుటుంబం రాజకీయాలకు కొంత విరామం ఇచ్చింది. అప్పటి ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డిని ఎదుర్కోవడంలో మీనాక్షి నాయుడుకే సత్తా ఉందని ఆ పార్టీ నాయకులు అధిష్టానాన్ని కోరగా ఇన్‌ఛార్జిగా ఆయనకే బాధ్యతలు అప్పగించారు. 2009లో సాయిప్రసాద్ రెడ్డిని స్వల్ప మెజార్టీతో ఓడించి ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో ఎమ్మెల్యేగా ఓడినా అధికారం టిడిపికి రావడంతో చక్రం తిప్పారు. ఆ సందర్భంలో పార్టీ నాయకులను, కార్యకర్తలను పట్టించుకోలేదని కొంత అపవాదు ఉంది. 2019లో మరో దఫా ఓడిపోవడంతో ఆ పార్టీలోనే కొందరు ఆయన నాయకత్వాన్ని విభేదించి మాన్వి దేవేంద్రప్ప, మధిర భాస్కర్ రెడ్డి, గుడిసె కృష్ణమ్మ మరో వర్గంగా ఉంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇరువురు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో పార్టీ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఇటీవల చంద్రబాబు ఇరువురితో చర్చలు జరిపి పార్టీ గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. యథావిధిగానే వేరే కుంపటిగా ఉంటూ కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. మీనాక్షి నాయుడు వయస్సు మీద పడిందని, ఆర్థిక బలం లేదని కొందరు దుష్ప్రచారం చేయడం సరికాదని, చరిష్మా తగ్గలేదని ఆ పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు.

అన్నకు అండగా : అధిష్టానం పిలుపుమేరకు నిర్వహించే పార్టీ కార్యక్రమాలను నియోజకవర్గంలో దిగ్విజయం చేయడంలో ఉమాపతి నాయుడు పాత్ర కీలకమని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. 2019 నుంచి వ్యాపార లావాదేవీలతో కొంతదూరంగా ఉన్నప్పటికీ బాబు పర్యటన నాటి నుంచి పార్టీ కార్యక్రమంలో ఉమాపతి నాయుడు చురుకుగా పాల్గొంటూ కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇస్తున్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ నిర్వహించిన 'యువగళం' పాదయాత్ర కర్నూలు ఉమ్మడి జిల్లాలో ముగిసే వరకు ఆయన వెంట నడిచి లోకేష్ పట్ల తన అభిమానాన్ని చాటుకున్నారు. మీనాక్షి నాయుడుకు వయస్సు మీద పడిందని, ఆర్థిక బలం లేదన్నది వట్టి అపోహ అని, తాను అండగా ఉండి ప్రత్యర్థులను అన్ని విధాలుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని పలు సందర్భాల్లో ఉమాపతి నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఉమాపతి నాయుడు రాజకీయ వ్యూహం ఫలిస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఆయన పూర్తిస్థాయిలో పనిచేస్తే పూర్వ వైభవం తీసుకు రావచ్చని చెబుతున్నారు. నాటి నుంచి అన్నకు అండగా ఉంటూ రాజకీయ వ్యవహారాల్లో కీలకంగా ఉమాపతి నాయుడు వ్యవహరించేవారని అంటున్నారు. టికెట్ చేజారే అవకాశం లేదని, నాయుడు కుటుంబంలో ఎవరికిచ్చినా సమిష్టిగా పని చేసి ఎన్నికల్లో గెలిపిస్తామని కార్యకర్తలు బాహాటంగానే చెబుతున్నారు. ఇప్పటికే ఉమాపతి నాయుడు, సిద్ధార్థ నాయుడు, మారుతి నాయుడు వివరాలు అధిష్టానం తీసుకున్నట్లు కూడా ప్రచారం జరిగింది. పెద్దాయన ఉండే వరకు ఆయనకు అండగా ఉంటామని సోదరులు, బంధువులు ఆయనకు మనోధైర్యం చెప్పినట్లు సమాచారం. ఉమాపతి నాయుడు చురుకుగా కార్యక్రమాల్లో పాల్గొంటుండడంతో కేడర్‌లో ఉత్సాహం వచ్చిందని పలువురు చెబుతున్నారు. ఉమాపతి నాయుడు వ్యూహం ఎలాంటి ఫలితం ఇస్తుందో వేచి చూడాలి.


పాదయాత్రలో ఉమాపతి నాయుడు (ఫైల్)

కళ్లకలక రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- డాక్టర్ మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



సీజనల్ వ్యాధులు దరిచేరకుండా పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపుతూ, జాగ్రత్తలు పాటించాలని భావన ఆస్పత్రి చైల్డ్ స్పెషలిస్ట్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో కొత్త, పాత నీరు కలవడం వల్ల ఆ నీరు తాగిన వారు రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం కళ్ల కలక తీవ్రంగా ఉందన్నారు. అలాంటి లక్షణాలున్న వారి దరికి పిల్లలను తీసుకోరాదన్నారు. పిల్లలకు తరచుగా సబ్బుతో ఒళ్లంతా స్నానం చేయిస్తూ శుభ్రంగా ఉంచాలని తెలిపారు. పిల్లలకు తీవ్రమైన నొప్పి ఏర్పడి జ్వరం వచ్చే అవకాశం ఉందన్నారు. ఎక్కువ సమయం చిన్న పిల్లలను ఆరుబయట ఉంచకుండా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. దగ్గు, జ్వరం వచ్చిన సమయంలో వేడి చేసిన నీటినే తాగాలన్నారు. డెంగీ, మలేరియా, డయేరియా, అతిసార వ్యాధులు పిల్లలకు సోకే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమకాటు బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల జ్వరం తీవ్రత తట్టుకోలేక అపస్మారక స్థితిలోకి జారుకునే ప్రమాదం ఉందన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే స్పెషలిస్టులను సంప్రదించి పిల్లలకు మెరుగైన వైద్యం చేయించాలన్నారు. ఆదోని పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో ఉన్న తమ ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉందన్నారు. టీకాలు, వాక్సినేషన్ సదుపాయం ఉందన్నారు.

ఆశ్రమ నిర్మాణానికి విరాళం

-నగదును అందజేస్తున్న జడ్‌పిటిసి విరుపాక్షి


నగదును అందజేస్తున్న జడ్‌పిటిసి విరుపాక్షి

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మెలగవల్లి గ్రామంలో శ్రీవివేకానంద ఆశ్రమ నిర్మాణానికి చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి రూ.25 వేల నగదును విరాళంగా అందజేశారు. ఆదివారం మొలగవల్లిలో వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి విరుపాక్షి మాట్లాడారు. గ్రామంలో యువత వివేకానంద స్ఫూర్తితో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఆశ్రమ నిర్మాణానికి ట్రస్ట్ సభ్యులకు తనవంతు సహాయంగా కొంత విరాళంగా ఇస్తున్నామని చెప్పారు. అనంతరం గ్రామం లోని నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ దేవాలయాన్ని సందర్శించారు.

బాబుకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి అధినేత చంద్రబాబుకు పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీ చేసే ధైర్యం కూడా లేదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఎద్దేవా చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరు ఘటనపై ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి రోడ్డుపై నిరసన చేపట్టారు. ఆదివారం కలుదేవకుంట గ్రామంలో రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఏదీ సూటిగా చేయరని, రూట్ మ్యాప్‌ను కాదని పర్యటించి గొడవలు సృష్టించారని విమర్శించారు. అధికారంలో ఉండగా ఏమీ చేయలేని చంద్రబాబు ప్రజలను పక్కదారి పట్టించేందుకు ప్రాజెక్టుల పరిశీలనతో తన అక్కసు వెళ్లగక్కడమే కాకుండా ఇలాంటి ట్రిక్కులు ఉపయోగిస్తున్నారని తెలిపారు. 2014 ఎన్నికల్లో బిజెపితో, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నారని, రానున్న 2024 ఎన్నికల్లో కూడా జనసేనతో పొత్తు పెట్టుకుంటారని తెలిపారు. తమ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒంటరిగా బరిలోకి దిగి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మిగనూరు : 2024 ఎన్నికల్లో టిడిపికి ఓటమి తప్పదని భావించి టిడిపి నాయకులు చంద్రబాబు నాయుడు ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొట్టే మాటలు మాట్లాడి పుంగనూరులో హింసకాండకు దారులు వేశారని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ధ్వజమెత్తారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుల యాత్ర అంటూ రాష్ట్రంలో పర్యటిస్తున్న చంద్రబాబు అనంత రౌడీలతో పథకం ప్రకారం పర్యటనను రోడ్డు మ్యాప్ ద్వారా వెళ్లకుండా అక్కడ గొడవలకు దారులు వేశారని తెలిపారు. టిడిపి హయాంలో ఏ ఒక్క ప్రాజెక్టు నిర్మించని చంద్రబాబు ఎన్నికల ముందు కమీషన్ల కోసం శిలాఫలకాలు వేశారని విమర్శించారు. రాజన్న జలయజ్ఞంతో రాష్ట్రం సస్యశ్యామలమైందన్నారు. రాష్ట్రం శాంతియుతంగా ఉండడం ఆయనకు ఇష్టం లేదని, చంద్రబాబు పర్యటన అంటే ప్రజలే భయపడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇకనైనా వెన్నుపోటు రాజకీయాలు మానుకొని శాంతియుత రాష్ట్రాన్ని ప్రజలకు అందించడానికి ముందుకు రావాలని హితవు పలికారు. వైసిపి మండల అధ్యక్షులు బిఆర్.బసిరెడ్డి, సోగనూరు భీమిరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

చిప్పగిరి : పుంగనూరులో జరిగిన ఘటనకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పిదమే కారణమని ఎంపిపి జూటూరు హేమలత మారయ్య దంపతులు తెలిపారు. చిప్పగిరిలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి, 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్న చంద్రబాబు మతిభ్రమించి కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపై రాళ్లు విసరడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఆయన పర్యటనలను ప్రజలు ఏమాత్రం ఖాతరు చేయకుండా ఎవరూ పట్టించుకోలేదని ఆవేశంతో ఇలాంటి సంఘటనలకు పాల్పడడం అవివేకమన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో చంద్రబాబును, ఆయన తనయుడు లోకేష్‌ను చిత్తు చిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు.


మంత్రాలయంలో నిరసన చేపడుతున్న ఎమ్మెల్యే, నాయకులు


ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి



మాట్లాడుతున్న జూటూరు హేమలత మారయ్య



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నేతలు

12న సామూహిక నిరసన : ఫ్యాప్టో

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 12న జిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగే 12 గంటల సామూహిక నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ యస్‌టియు భవన్‌లో కర పత్రాలు ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ ప్రకార్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హృదయ రాజు, జిల్లా చైర్మన్, జనరల్ సెక్రటరీలు ఎస్.గోకారి, జి.తిమ్మప్పలు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాడు ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు అయినా హామీ నెరవేర్చలేదన్నారు. రాజస్థాన్, పంజాబ్ చత్తీస్గడ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాలు ఓపిఎస్ అమలు చేసే దిశలో ఉన్నాయన్నారు. అక్కడ సాధ్యం కాగా ఇక్కడ ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. పాఠశాల ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వైఖరి మార్చుకోవాలన్నారు. ఉమ్మడి సర్వీసులను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, జిల్లా నాయకులు లతీఫ్, ఎస్టియు నుండి టీకే జనార్ధన్, శేఖర్, నాగరాజు, గోవింద్ నాయక్, దేవదాస్, సురేష్, ఏపీటీఎఫ్ 1938 నుండి మరియానందం, బిటిఏ నుండి సుధాకర్, నందీశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కోసమే పోలీస్ కవాతు

ప్రజాశక్తి - పత్తికొండ

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం కోసమే రాపిడ్ యాక్షన్ ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులతో కవాతు నిర్వహించినట్లు కేంద్ర రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అడిషనల్ ఎస్పీ భాగల్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు ఆదివారం పత్తికొండ పట్టణంలో సబ్ డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ (పోలీస్ కవాత్)ను అధునాతనమైన ఆయుధాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ మురళీమోహన్ ఎస్సై వెంకటేశ్వర్లు, గోపాల్ స్థానిక పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ మరణం తీరనిలోటు : సాహితీ స్రవంతి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

జనరంజకమైన పాటలతో జాతిని ఉర్రూతలూగించిన ప్రజాగాయకుడు గద్దర్ అని, అతని మరణం సాంస్కృతిక కళారంగాలకు తీరనిలోటని, ప్రజాపాటల యుద్ధనౌక గద్దర్ అని సాహితీస్రవంతి రాష్ట్రకార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసమూర్తి, ఆవులబసప్ప, నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అయ్యన్న, చక్రపాణి యాదవ్ లు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మరణం తీరనిలోటని, ఈ తరం గుర్తించుకోదగ్గ గొప్ప కళాకారుడు గద్దర్ అని టిజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పతి ఓబులయ్య కార్యదర్శి మహమ్మద్ మియాలు ప్రకటన విడుదల చేశారు.

గద్దర్, జంపాలకు నివాళులు : ప్రముఖ గాయకుడు గద్దర్, జెవివి జాతీయ కార్యదర్శి జంపా కృష్ణ కిషోర్‌లకు జన విజ్ఞానవేదిక ఆదివారం సాయంత్రం సంతాపం ప్రకటించింది. డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి సురేష్, మహమ్మద్ మియా, ప్రతాపరెడ్డి, దామోదర్‌తో పాటు మరికొంతమంది జన విజ్ఞానవేదిక కార్యకర్తలు నివాళ్లులు అర్పించారు. డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ క్రిష్ణ కిషోర్ సుమారు 40 సంవత్సరాల పాటు జనవిజ్ఞానవేదికకు సేవలందించారని గుర్తుచేశారు. అనేక జిల్లాల్లో జెవివి ఆవిర్భానికి పెద్ద ఎత్తున కృషి చేశారన్నారు. సభలో సుబాలా, సరస్వతమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీవ్ర విషాదం : బైరెడ్డి రాజశేఖరరెడ్డి

కర్నూలు అగ్రికల్చర్ : ఎన్నో విప్లవ గీతాలు వినిపించి ప్రత్యేక తెలంగాణ సాధనకు కృషి చేసిన ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరని విషాదమని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గద్దర్ మతి పట్ల సంతాపం తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. **కర్నూల్ కార్పొరేషన్ :** ప్రజా గాయకుడు గద్దర్ మృతి బాధాకరమని, కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన మతి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పేర్కొన్నారు. సిపిఐ జిల్లా సమితి తరపున ప్రగాఢ సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. **నంద్యాల :** ప్రజా కళాకారుడు, విప్లవ రచయిత, గాయకుడు గద్దర్ అనారోగ్యంతో మృతి చెందడం పట్ల సిపిఐ జిల్లా సమితి సంతాపం ప్రకటిస్తూ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పిడిఎస్‌యు జిల్లా కమిటీ తరపున జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి రఫీ సంతాపం తెలుపుతూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



మాట్లాడుతున్న నాయకులు

విద్యుత్ మీటర్స్ అసోసియేషన్ నేత అరెస్టు

ప్రజాశక్తి - తుగ్గలి

విద్యుత్ యాజమాన్యంతో చర్చలు విఫలం కావడంతో సోమవారం తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు వెళ్లకుండా ఎపి విద్యుత్ మీటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.రాజును ఎస్సై మల్లికార్జున తమ సిబ్బందితో ఆదివారం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ మీటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యను ధర్నాల ద్వారా తెలియజేయడానికి తలపెట్టిన కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరి కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యుత్ మీటర్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అక్రమంగా అరెస్టు చేయడం సరి కాదు : సిఐటియు

విద్యుత్ మీటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాజును అక్రమంగా అరెస్టు చేయడం సరి కాదని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రతాప్, రంగస్వామి ఖండించారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



రాజును పోలీస్ స్టేషన్ తీసుకొస్తున్న ఎస్ఐ

కర్నూలు కార్పొరేషన్ : తిరుపతికి వెళుతున్న విద్యుత్ కార్మికులను రైల్వే స్టేషన్లో భీమేష్ (కాంట్రాక్ట్ ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకుడు), నాగన్న (జెఎల్ఎం ఎమ్మిగనూరు)లను అరెస్టు చేసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - తుగ్గలి

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పగిడిరాయి మండల పరిషత్ పాఠశాలలో కర్నూలు విజయభారతి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో విజయ భారతి వైద్యులు, వైద్య సిబ్బంది, సర్పంచ్ సౌజన్య మాజీ జెడ్పిటిసి జగన్నాథరెడ్డి, రామచంద్ర రెడ్డి, నగష్ యాదవ్, టిఎండీ హుస్సేన్, తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, చాంద్ బాషా, లాల్ రెడ్డి, హనుమంతు, రామాంజినేయులు, ప్రజలు పాల్గొన్నారు.



కంటి చుక్కలను వేస్తున్న ఎమ్మెల్యే

అక్రమ అరెస్టులను ఖండించండి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ తిరుపతిలో ఆందోళన చేయడానికి బయలుదేరుతున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు ఆదివారం ఖండించారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు న్యాయమైన డిమాండ్స్ కోసం పోరాడుతున్నారని, డిమాండ్స్‌ను పరిష్కరించకపోగా వారిని కించపరచే విధంగా కామెంట్లు చేయడం పట్ల మనోభావాలు దెబ్బతిన్న కాంట్రాక్టు, రెగ్యులర్ ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమైతే అరెస్టు చేయడం తగదన్నారు. కార్మికులను అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురి చేసి, పోరాటాలను ఆపలేరని తెలిపారు. పోలీసులు కార్మికులపై ఒత్తిడి తీసుకొస్తే అంత పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని అన్నారు. సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు 45 శాతం ఫిట్మెంట్ అమలు చేయాలని. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండుతో ఆందోళన చేస్తున్న విద్యుత్తు ఉద్యోగులను అణచివేయాలనుకోవడం అనాగరికమైన చర్య అన్నారు.

ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, రాష్ట్రాలలో విద్యుత్ ఉద్యోగులు ఉద్యమించి ప్రైవేటీకరణను తిప్పి కొట్టారని, అదే స్ఫూర్తితో ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా విద్యుత్తు ఉద్యోగులు ఉద్యమాలకు సిద్ధమవుతారని తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంతవరకు సిఐటియు వారికి అండగా ఉండి ఆందోళనలో భాగం పంచుకుంటుందని చెప్పారు.

కెసి కాల్వకు నీరు విడుదల చేయాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు

శ్రీశైలం డ్యామ్‌లో 860 అడుగులకు పైగా నీరు చేరుకున్నందున మల్యాల ఎత్తిపోతల పథకం నుండి కెసి కాల్వకు నీరు విడుదల చేయాలని టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మల్యాల ఎత్తిపోతల పథకాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీరు సమృద్ధిగా ఉన్నా కూడా రైతులను ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్నారు. వెంటనే నీరు విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్చార్జి జయసూర్య, అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి, సురేంద్ర నాథ్ రెడ్డి, పలుచాని మహేశ్వర్ రెడ్డి, లాడెన్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు జయాకర్, సురేష్, శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న గౌరు వెంకట రెడ్డి తదితరులు

ఆధునీకరణ పనులను మేయర్, ఎమ్మెల్యే పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కొండారెడ్డి బురుజు వెనుక భాగంలో రూ.1.90 కోట్లతో కర్నూలు నగర పాలక సంస్థ చేస్తున్న ఆధునీకరణ పనులను ఆదివారం నగర మేయర్ బివై.రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో మూడు నెలల్లోపు ఈ పనులు పూర్తి చేస్తామని, కొండారెడ్డి బురుజు వెనుకన (కోర్టు రోడ్డు) పాదచారులు మాత్రమే రాకపోకలు సాగించాల్సి ఉంటుందని, వాహనాలు అంబేద్కర్ సర్కిల్ వైపు నుంచి వెళ్ళేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చారిత్రాత్మక కట్టడమైన కొండారెడ్డి బురుజుకు న్యూ లుక్ తీసుకొస్తామన్నారు. పార్కు తరహా అభివృద్ధి చేస్తూ, వాటర్ ఫౌంటెన్స్, చరిత్రకారుల విగ్రహాలు వంటివి ఏర్పాటు చేస్తామన్నారు. రాయలసీమ ముఖద్వారమైన 'కర్నూలు' అనగానే రాష్ట్రంలో అందరికీ గుర్తుకు వచ్చేది దశాబ్దాల చరిత్ర కలిగిన కొండారెడ్డి బురుజే అన్నారు. అందుకే అక్కడ అహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టామన్నారు.



కొండారెడ్డి బురుజు వద్ద పనులను పరిశీలిస్తున్న మేయర్, ఎమ్మెల్యే

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ నాయకులు బుచ్చర్ల. నరసింహులు మాదిగ, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు శేషు మాదిగ పేర్కొ న్నారు. ఆదివారం పట్టణంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నియోజక వర్గ స్థాయి సన్నాహక సదస్సు నియోజకవర్గం అధ్యక్షులు ప్రతాప్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల పట్ల చిత్తశుద్ధితో వహించి ఏబిసిడి వర్గీకరణకు మద్దతు తెలపాలన్నారు. మాదిగల విశ్వరూపం మహాసభ జయప్రదం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ జీవి నారాయణ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కడియాల జయ రాముడు మాదిగ, జిల్లా గౌరవ అధ్యక్షులు పెద్ద మునయ్య మాదిగ ,జిల్లా కన్వీనర్ కత్తి ఓబులేసు మాదిగ , జిల్లా కన్వీనర్ శివ నారాయణ మాదిగ, విహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు దేవరాజు మాదిగ, నాయకులు హరి రామకృష్ణ మాదిగ హనుమంతు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదిగ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని జొన్నగిరి సాంఘిక సంక్షేమ ప్రభుత్వ వసతి గృహం విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన మెటీరియల్స్‌ను విద్యా కమిటీ చైర్మన్ గుంత రాఘవేంద్ర ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాలలో చదివే విద్యార్థులకు అన్ని వసతులను కల్పిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రస్తుత ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తుందన్నారు. విద్యార్థులు కూడా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బారాయుడు స్వామి నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లాలో దేవాదాయ శాఖలో అధికారి సురేష్ కుమార్ స్వామి రూ.1,00,116 లు విరాళంగా ఇచ్చారు. ఆదివారం వారు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం విరాళం అందజేశారు. దాతలకు ఇఒ రామకృష్ణ, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

బిజెపికి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో బిజెపికి మద్దతు ఇచ్చే వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ఓడించాలని డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓబిసి జిల్లా చైర్మన్ ఎం కాశీంవలి అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు మాట్లాడుతూ బిజెపి పార్టీ హిందుత్వ పార్టీ అని, ముస్లింలు, క్రిస్టియన్లు, ఎస్సీ, ఎస్టీలు వారికి అవసరం లేదన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో ఆ కులాలపై దాడులు జరుగుతున్నాయన్నారు. అక్కడి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కె.సత్యనారాయణ గుప్త, ఇతర విభాగాల నాయకులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి పట్ల సంతాపం : ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ బాబు పేర్కొన్నారు.

నేడు చేనేత దినోత్సవం

ప్రజాశక్తి - కోడుమూరు

కోడుమూరు పట్టణంలో సోమవారం 9వ చేనేత జాతీయ దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నట్లు చేనేత సంఘం నాయకులు దానకర్ణ, ఏకంబర మూర్తి, కొత్తపేట వెంకటేశ్వర్లు, బీసీ కాలనీ వెంకటేశ్వర్లు, మాధవస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 10 గంటలకు అరుణోదయ బుక్ సెంటర్ సమీపంలోని హరేరామ హరే కృష్ణ సూపర్ మార్కెట్ దగ్గర ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు ఎంఎల్ఏ డాక్టర్ సుధాకర్, రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ డైరెక్టర్ సీబీ కృష్ణవేణి, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. చేనేతలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు.

నేడు జిల్లా పరిషత్‌లో స్పందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

స్పందన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం నేడు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సృజన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చి ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవాలని కలెక్టర్ కోరారు.

చంద్రబాబుకు మతిభ్రమించింది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తుగ్గలి

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకి పూర్తిగా మతిభ్రమించిందని పత్తికొండ శాసనసభ్యులు శ్రీదేవి అన్నారు. ఆదివారం మండలంలోని పగిడిరాయి గ్రామంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చంద్రబాబు నాయుడుకి మతిభ్రమించి తెలుగు తమ్ముళ్ళని రెచ్చగొట్టి విధ్వంసాలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్ని కుయుక్తులు, కుతంత్రాలు చేసినా ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. 2024లో రాష్ట్ర ముఖ్యమంత్రి మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రామచంద్రారెడ్డి, జగన్నాథ్ రెడ్డి, నగేష్ యాదవ్, రాతన మోహన్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ టిఎండి హుసేని, తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, మండల కోఆప్షన్ సభ్యులు చాంద్ భాషా, సుధాకర్ రెడ్డి, సర్పంచ్ సౌజన్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు. **కోడుమూరు :** చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు లాయర్ ప్రభాకర్, అద్దుగాల, రాజశేఖరరెడ్డి, బలరాం, కార్యకర్తలు పాల్గొన్నారు. **కర్నూలు హాస్పిటల్ :** పుంగనూరులో ఘర్షణలకు ఆజ్యం పోసిన చంద్రబాబు నాయుడు వైఖరికి నిరసనగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్లో వైసిపి నాయకులు బాబు దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ 16 వార్డుల కార్పొరేటర్లు, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుగ్గలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



కోడుమూరులో చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఎమ్మెల్యే



కల్లూరు చెన్నమ్మ సర్కిల్లో నిరసన చేస్తున్న నాయకులు